




పంటనష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ఎకరాకు రూ.50 వేలు పరిహారమివ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని డిమాండ్
- పంటనష్టాలను పరిశీలించిన సిపిఎం, రైతుసంఘం బృందం

ప్రజాశక్తి-జామి, గంట్యాడ

వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. జామి మండలంలోని విజినిగిరి, తానవరం, గంట్యాడ మండలంలోని బుడతనాపల్లి, పెంటశ్రీరాంపురం గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను బుధవారం సిపిఎం, ఎపి రైతుసంఘం బృందం పరిశీలించింది. రైతులతో తమ్మినేని మాట్లాడి, నష్టం వివరాలు తెలుసుకున్నారు. ధాన్యాన్ని వెంటనే గోనె సంచులు అప్పగించి, తరలించాలని తమ్మినేని డిమాండ్ చేశారు. ఇప్పటికే వరి రైతు పూర్తిగా నష్టపోయాడని, నిబంధనలు పక్కన పెట్టి ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతుధర ఇచ్చి, కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మినుములు, పెసలు వంటి అపరాల పంటలు నష్టపోయాయని, మళ్లీ పంటసాగు కోసం విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు.

కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు, నాయకులు ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ.. వర్షపునీటిలో తేలిపోయిన కోసిన వరిచేను



పూసపాటిరేగ.. చెరువులా తయారైన వరిపొలాలు

నిండా ముంచేసింది

మిచౌంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతన్నను నిండా ముంచేశాయి. మంగళవారం సాయంత్రం నుంచి భారీవర్షాలు ఎక్కువ కావడంతో పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. పొలాల్లో వేసిన ఓవులు, కళ్లాల్లో భద్రపర్చిన ధాన్యపు రాశులు వర్షపునీటిపాలయ్యాయి. అకాల వర్షాలు చేతికి అందిన పంటను నోటి వరకు రాకుండా చేశాయంటూ అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అక్టోబర్‌లో ఏర్పడిన తీవ్ర వర్షాభావంతో సుమారు లక్ష ఎకరాల వరకు నీటి ఎద్దడికి గురైంది. అప్పుడు అనావృష్టి, ఇప్పుడు అతివృష్టితో సగటు వరి రైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది.

- వేలాది ఎకరాల్లో నీట మునిగిన వరి
- గట్లు, పంటపొలాలు జలమయం
- తడిచి ముద్దయిన ధాన్యం రాశులు
- ఆదుకోకపోతే అన్నదాత పరిస్థితి దయనీయమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 2,83,912 ఎకరాల్లో సాగయ్యాయి. అత్యధికంగా వరి 2,34,437 ఎకరాల్లో సాగైంది. మొత్తం వరి విస్తీర్ణంలో 80 వేల ఎకరాల వరకు అక్టోబర్ నాటికి నీటి ఎద్దడి ఎదుర్కొంది. దీంతో, వరిని బతికించుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. నీటి వసతి లేని చోట పంట పూర్తిగా నాశనమైంది. ఇటీవల అధికారులు చేపట్టిన పంటకోత ప్రయోగాల్లో దిగుబడి గతేడాది కన్నా ఎక్కువగా వస్తున్నట్టు సంకేతాలు రావడంతో రైతులు మరింత ఆశపడ్డారు. ఆ ఆశలపై 'మిచౌంగ్' పేరిట వచ్చిన తుపాను చిదిమేసింది. రైతులకు తీవ్ర నిరాశను, నష్టాలను మిగిల్చింది. ఈ నెల 4వ తేదీన 2.7 మిల్లీమీటర్లు, 5న 25.1 మి.మీ మాత్రమే వర్షపాతం నమోదైంది. దీంతో తుపాను ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని కొంతమంది భావించారు. ఐదోతేది రాత్రి తుపాను తీరం దాటిన సమయంలో జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల కుండపోత వర్షాలు కురిశాయి. రాత్రంతా వర్షం కురిసింది. బుధవారం వర్షపాతం 89.4 మి.మీ సరాసరి నమోదైంది. మూడు రోజుల్లో సరాసరి 117.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా భోగాపురంలో 17, లక్కవరపుకోటలో 16 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. ఫలితంగా జిల్లాలో అన్ని మండలాల్లోనూ వరి పంటకు అపారనష్టం వాటిల్లింది. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల తోటపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టారు. దీంతో నాగావళి నదిలో నీటి మట్టం పెరిగింది. దీంతో వంగర మండల పరిధిలోని శివ్వాం, తలగాం, ఓని అగ్రహారం, చినరాజులగుమ్మడ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

జిల్లాలో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ)
పూసపాటిరేగ	94.8
కొత్తవలస	132.8
వేపాడ	105.8
భోగాపురం	170.2
విజయనగరం	101.2
గుర్ల	131.8
గంట్యాడ	91.8
బొండపల్లి	110.1
లక్కవరపుకోట	160.4
జామి	77
గజపతినగరం	109.6
శృంగవరపుకోట	130
చీపురుపల్లి	71
మెంటాడ	119.6
గరివిడి	75.8
రేగిడి	32.8
సంతకవిటి	31.4
రామభద్రపురం	81.2
నెల్లిమర్ల	74.6
దత్తిరాజేరు	95.2
రాజాం	47.6
మెరకముడిదాం	56.8
తెర్లాం	49.4
బొబ్బిలి	49.4
డెంకాడ	144.8
బాడంగి	38.8
వంగర	28.6



నెల్లిమర్ల.. తడిసిన వరిపనలను చూపిస్తున్న రైతు



నెల్లిమర్ల.. వర్షపునీటిలో మునిగిపోయిన వరిచేను

రంగుమారే అవకాశం

చేతికందిన పంటను భద్రపర్చుకునేందుకు రైతులు పడిన, పడుతున్న యాతన అంతా ఇంతా కాదు. కోత దశకు వచ్చిన చేను అధికారుల సూచన మేరకు వర్షాలు కారణంగా నిలిపివేసినప్పటికీ నేలకొరిగిపోయింది. కళ్లాల్లో దాచుకున్న ధాన్యపు రాశులు సైతం తడిసి ముద్దయ్యాయి. దీంతో పంట దెబ్బతినడంతోపాటు ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ చోట్ల ధాన్యం మొలకెత్తడం, రంగు మారిపోవడం వంటి పరిస్థితులు ఎదురవుతాయి. నాణ్యత పేరిట వీటిని కొనుగోలు చేసేందుకు అధికారులు నిరాకరించినా, ధర తగ్గించినా రైతులు అప్పుల్లో కూరుకుపోవడం ఖాయమంటూ రైతులు, సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి ఖాయమైతే రైతులకు తేరుకోలేని దెబ్బతగిలినట్టేనని చెబుతున్నారు.



చీపురుపల్లి.. తడిసిన వరిచేనును పరిశీలిస్తున్న విఎఎ

వేల ఎకరాల్లో పంట మునక

జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షాల వల్ల వేల ఎకరాల్లో పంట ముంపునకు గురైంది. వర్షపు నీరు పెరగడంతో చెరువులు, కళ్లాలు, పొలాలు ఏకమై ముంపునకు గురయ్యాయి. అత్యధికంగా లక్కవరపుకోట మండలంలో 1704 ఎకరాల్లో, మెంటాడ మండలంలో 900 ఎకరాల్లో, గజపతినగరం మండలంలో 780 ఎకరాల్లో, చీపురుపల్లి మండలంలో 700 ఎకరాల్లో, జామి మండలంలో 380 ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. డెంకాడ మండలంలో 100 ఎకరాల్లో, రామభద్రపురం మండలంలో 90 ఎకరాల్లో, నెల్లిమర్ల మండలంలో 45 ఎకరాల్లో పంట ముంపు బారిన పడింది. బొబ్బిలి మండలంలో జగన్నాథపురం, కోమటిపల్లి, కొత్తపెంట, గోపాలరాయుడుపేట, పారాది తదితర గ్రామాల్లో 63 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. మిగిలిన మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులంతా కన్నీరుపెడుతున్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

తుపానుతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి, నష్టాన్ని పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటలు కాపాడేందుకు ప్రాధాన్యత

9 తర్వాత పంటనష్టాల అంచనా: కలెక్టర్

వర్షం తగ్గిన వెంటనే వరి పంటను కాపాడేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో పంట కోతలు కోసి ఆయా పొలాల్లోనే వదిలిపెట్టారని తెలిపారు. పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడేందుకు వీలుగా నిల్వ ఉన్న వర్షపు నీటిని తోడేందుకు వీలుగా సాయాన్ని అందిస్తామని తెలిపారు. దీంతోపాటు మరో 400 ఎకరాల్లో పంట కోతకు సిద్ధంగా ఉందని, దీనిని కాపాడే ప్రయత్నం చేస్తామని చెప్పారు. పంటపొలాల్లో వర్షపు నీరు తగ్గిన తర్వాత ఈ నెల 9 నుంచి పంటనష్టాలపై అంచనా వేసే కార్యక్రమం చేపడతామన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు పెద్ద ఎత్తున వర్షపాతం నమోదైనట్టు కలెక్టర్ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్సులో ఎస్‌పి దీపిక పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, ప్రకృతి వైపరీత్యాల యాజమాన్య సంస్థ డిపిఎం ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తీరం ప్రశాంతం

పూసపాటిరేగ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ మిచౌంగ్ తుపాను తీరం దాటడంతో చింతపల్లి తీరం బుధవారం ప్రశాంతంగా మారింది. సముద్రం వెంబడి గాలులు తగ్గి, సముద్ర కెరటాలు నిమ్మలంగా మారాయి. తుపాను తీరం దాటే సమయంలో భారీవర్షంతో పాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తాయన్న సమాచారంతో జిల్లా, మండల అధికారులు రెండు రోజులుగా తీరగ్రామాల్లో మకాం వేశారు. ఎక్కడ ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మంగళవారం రాత్రి భారీ గాలులు వేసినా ఎక్కడా ఇబ్బందులు కలగలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఉదయం నుంచే వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రజలంతా యథావిధిగా బయటకు వచ్చారు. మత్స్యకారులు మాత్రం వేటకు వెళ్లేందుకు ఎటువంటి అనుమతులూ లేవు. మండలంలోని అరటి, కొబ్బరి రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకున్నా, వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.



ఆటుపోట్లు తగ్గిన సముద్రం

నగరంలో వర్ష బీభత్సం

- కూలిన ఉర్దూ పాఠశాల ప్రహరీ
- తెరచుకోని ఫుట్‌పాత్ షాపులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షం నగరంలో బీభత్సం సృష్టించింది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా పల్లపు ప్రాంతాల్లో, షాపుల్లో నీరు చేరి స్తంభింపచేసింది. వర్షానికి మూడు రోజులుగా నగరంలో ఉన్న ఫుట్‌పాత్ షాపులు తెరుచుకోక, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఆబాద్‌వీధిలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రహరీ మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు కూలిపోయింది. నగరంలో తోటపాలెం, కలెక్టరేట్, రాజీవ్‌నగర్ కాలనీ, కనపాక యూత్ హాస్టల్, పావని నగర్, వైఎస్‌ఆర్ నగర్ వెళ్లే రహదారి, రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరింది. కలెక్టరేట్ సమీపంలోని షాపుల్లో నీరు చేరింది. గంటస్తంభం వద్ద ఉన్న మార్కెట్‌లోకి వర్షపు నీరు చేరడంతో షాపులు తెరుచుకోలేదు.

ఉర్దూ స్కూల్ ప్రహరీని వెంటనే నిర్మించాలి

నాడు-నేడు కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ప్రహరీకి రంగులేసి వదిలేశారు. పాత ప్రహరీని కొత్తగా చూపించారు. కానీ అది ప్రస్తుత వర్షాలకు కూలిపోయింది. నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు పర్యటించారు. కూలిపోయిన ఉర్దూ పాఠశాల ప్రహరీని ఆయన పరిశీలించారు. తక్షణమే ప్రహరీ గోడ మొత్తం తొలగించి, కొత్తది నిర్మించాలని శంకరరావు డిమాండ్ చేశారు. నగర సమస్యలపై పాలకులు దృష్టిపెట్టి, పరిష్కరించాలని కోరారు. పర్యటనలో ఎస్‌కె భాషా పాల్గొన్నారు.



కూలిపోయిన ఉర్దూ పాఠశాల ప్రహరీ

సైనిక పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం

ఆలిండియా సైనిక పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 9వ తరగతులలో ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు డిఆర్‌ఒ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. 21.1.2024న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం వరకు పరీక్ష ఫీజు గడువు ఉందని తెలిపారు. సాధారణ, జనరల్, డిఫెన్స్ మాజీ సైనికులు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు రూ.650, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.500 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో పేమెంటు గేట్‌వే, డెబిట్, క్రెడిట్ కార్డులు, లేక ఇంటర్నెంట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. మీడియం, పరీక్ష సిలబస్, రిజర్వేషన్, ఫీజు, పరీక్షా కేంద్రాలు, తదితర వివరాల కోసం www.nta.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఫెన్సింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 8, 9, 10 తేదీల్లో నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగే ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ వాల్‌పోస్టర్‌ను జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మేయర్ వి.విజయలక్ష్మి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ ఆవిష్కరించారు. పోటీల వివరాలను వారికి టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ డివి చారి వివరించారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మీరైనా మా గోడు పట్టించుకోండి

అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల సమయంలో సిఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ అన్నారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై ఈ నెల 8 నుండి సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. ఐసిడిఎస్ సిబ్బంది పలు సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం రకరకాల యాప్‌ల పేరుతో ఒత్తిడికి గురిచేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులు మంజూరులో జాప్యం తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రెండేళ్లుగా ఎన్నో పోరాటాలు చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. యాప్‌లన్నీ తొలగించి ఒక యాప్ ద్వారానే కార్యక్రమం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతవరకు ఆ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె తప్పదని హెచ్చరించారు. అనంతరం అక్కడ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభ, ప్రసన్న, శివలక్ష్మి, లలిత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో పంచాయతీల వ్యవస్థ నిర్వీర్యమైందని టిడిపి విజయనగరం మండల అధ్యక్షులు బి.నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక అశోక్ బంగ్లాలో గ్రామాల అభివృద్ధికి సర్పంచుల సమర శంఖారావం పేరుతో నియోజక వర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు, గంటా పోలినాయుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు మాట్లాడారు. చట్టబద్ధంగా పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోగా, కేంద్రం విడుదల చేసిన నిధులను దారిమళ్లించడం దారుణమన్నారు. సర్పంచుల న్యాయబద్ధమైన 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రౌతు సోమినాయుడు, మాజీ ఎంపిపి కంది సాయిజగ్గారావు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి వేచలపు శ్రీను, నియోజకవర్గ సర్పంచుల సంఘం సభ్యులు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొద్దల నర్సింగరావు

నగరంలో కమిషనర్ పర్యటన

విజయనగరం టౌన్ : తుపాను నేపథ్యంలో నగరంలో అక్కడక్కడ ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను బుధవారం కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు పరిశీలించారు. వాటి పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. వర్షపునీరు అధికంగా ప్రవహిస్తున్న ప్రధాన కాలువలను పరిశీలించారు. ట్యాంక్ బండ్ రోడ్డు, భగవాన్ నగర్, ధర్మపురి వంటి ప్రాంతాలలో కాలువలను గమనించి వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ట్యాంక్ బండ్ రోడ్డు వద్దనున్న ప్రధాన కాలువలో గుర్రపుడెక్కను జెసిబిల సహాయంతో తొలగించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు డివైడర్ల మధ్యలో రెండు చెట్లు నేలకొరగడంతో వాటిని తొలగించారు. అనంతరం రింగ్ రోడ్డు ప్రాంతంలో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఇ దక్షిణామూర్తి, డిఇ అప్పారావు, సూపర్‌వైజర్ అంజిబాబు, రవిశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో

గెస్ట్ లెక్చరర్లను నియమించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం : ఐటిఐ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించి తరగతులు నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి.. ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. పోస్టుల ఖాళీల వల్ల ఏ సబ్జెక్టు లో కూడా అధ్యాపకులు లేకుండా ఉండకూడదని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరు కావలసిన పనులు, రావాల్సిన నిధుల కోసం వెంటనే లేఖ రాయాలన్నారు. స్థానికంగా ఏమేమి చేయగలమో అవన్నీ వెంటనే చేయాలని సూచించారు. ఇటీవల ఎస్‌ఎఫ్‌ఐ నుండి జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో గుర్తించిన లోపాలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తన ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్ ఆయా కళాశాలల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో మౌలిక వసతులైన తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్తు, ప్రహరీ, లెక్చరర్ పోస్టుల భర్తీ, వసతిగృహాల నిర్వహణ, భోజన నాణ్యత తదితర అంశాలపై ఎస్‌ఎఫ్‌ఐ వినతి అందించినట్లు తెలిపారు. కళాశాలల వారీగా కలెక్టర్ సమీక్షిస్తూ నాడు-నేడు కింద మంజూరైన పనులన్నిటినీ త్వరగా పూర్తి చేయడం వల్ల అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేయడానికి ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త భవనాలు, అదనపు తరగతి గదులు మంజూరు కోసం ప్రభుత్వానికి తన ద్వారా లేఖ రాయాలని కలెక్టర్ సూచించారు. వసతిగృహాలలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, దీనిపై ఆయా హెచ్‌ఒడిలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సరిగ్గా ఆహారాన్ని అందించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవకాశం ఉన్నంతవరకు అన్ని కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. సమావేశంలో డిఇఒ లింగేశ్వర రెడ్డి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి కె.సందీప్, డివిఇఒ భీమశంకరరావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామానందం, తదితరులు పాల్గొన్నారు.

మసీదుల ఆస్తులు దోపిడీ

విజయనగరం కోట : రాష్ట్రంలో ముస్లిముల మసీదు ఆస్తులు, ఆదాయాలను సిఎం జగన్ కొల్లగొడుతున్నారని మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బాజీ ఆరోపించారు. బుధవారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైనార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నంలో క్రైస్తవ ఆలయ ఆస్తులను కూడా కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆనాడు ఔరంగజేబు తన తండ్రిని ఏం చేశారో, అదేవిధంగా జగన్మోహన్ రెడ్డి తన తల్లిని రోడ్డు మీద నిలబెట్టారన్నారు. ఔరంగజేబుకు, జగన్మోహన్‌రెడ్డికి పెద్ద తేడా లేదన్నారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ కమిటీల నియామకాలు పూర్తిచేసి, ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ వర్మ, శ్రీనివాసరావు, మైనార్టీ అధ్యక్షులు ఆదిల్ పాల్గొన్నారు.

రైతుకు తప్పని క'న్నీటి' కష్టాలు

జిల్లా వ్యాప్తంగా మిచౌంగ్ తుపాను వల్ల కురిసిన వర్షాలు రైతులను ముంచేశాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం అర్ధరాత్రి తరువాత పడిన భారీ వర్షానికి పొలాల్లో వరి చేలు తేలియాడాయి. చాలా చోట్ల పొలాల్లో పెద్ద ఎత్తున నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తుగా రైతులు తాము కోసిన వరి చేలును పొలంలో చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకున్నప్పటికీ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరి వరి కుప్పలు సైతం పూర్తిగా తడిచి ముద్దాయి. వరి కుప్పలు చుట్టూ నీరు చేరడంతో వరి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది రైతులు పొలాల్లో చేరిన వరద నీటిని మళ్లించే పనిలో నిమగ్నమవగా కొంత మంది తడిచిన వరి చేలును గట్లపై వేసుకుని కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. పొలాల్లో వరద తగ్గితే తప్ప పంట నష్టాలను అంచనా వేయలేమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ వర్షాలకు నెల్లిమర్ల వసతి గృహం ప్రహరీ కూలిపోయింది.

- ముంచేసిన మిచౌంగ్ తుపాను
- నీటిలో తేలియాడిన వరి చేలు
- చెరువులను తలపిస్తున్న పొలాలు
- వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ
- వరద తగ్గితేనే పంట నష్టం అంచనా : వ్యవసాయశాఖ


మెంటాడ: నీట మునిగిన వరి కుప్పలు


బొబ్బిలి: పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు శంకరరావు


నెల్లిమర్ల: కూలిన వసతిగృహ గోడ


జామి: తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ హేమంత్

ప్రజాశక్తి - జామి

తుపాను నుంచి తప్పించుకోవాలని అన్నదాత ఎన్ని ప్రయత్నాలు చేసినా, చివరికి వర్షపు నీటికి దొరికిపోయాడు. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కుప్పలు పెట్టిన వరి పంట సైతం చిక్కుకుంది. తుపాను హెచ్చరికలతో మండలంలో సుమారు 90 శాతం వరి కోతలు పూర్తి చేసి, పంటను కల్లాలు, పొలాల్లో కుప్పలు పెట్టారు. కురుస్తున్న వర్షం ఎక్కువవడంతో లోతట్టు ప్రాంతాలు, పొలాలు జలమయమ య్యాయి. దీంతో పంటతో ఉన్న కుప్పలు చుట్టూ భారీగా నీరు చేరింది. మనడలంలోని తానవరం, విజినిగిరి, రామయ్యపాలెం, బీమసింగి, పీతలపాలెం గ్రామాల్లో వరి పంట అత్యధికంగా నీటిలో చిక్కుకుంది. కొంత వరకు కోసిన పంట నీటిలో మునిగిపోగా, అత్యధిక గ్రామాల్లో కుప్పలు సైతం వర్షపు నీటిలో మునిగిపోయిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే అన్నదాత తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయాడు. మండలంలో 25 పంచాయ తీల్లో సుమారుగా 12వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. తుపాను ముంచు కురావడంతో సమయం లేక, పోలాల్లోనూ, సమీప కల్లాల్లోనూ వరి కుప్పలు పెట్టారు. వర్షపు నీరు పెరగడంతో చెరువులు, కళ్ళాలు, పొలాలు ఏకమై ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే పంట దెబ్బతినడంతో పాటు ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని తానవరం, తాండ్రంగి ప్రాంతాల్లో ముంపునకు గురైన వరి పంటలను తహశీల్దార్ హేమంత్ కుమార్ పరిశీలించారు. నూర్చిన ధాన్యాన్ని వ్యవసాయ అధికారితో కలిసి పరిశీలించిన తహశీల్దార్ తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 380 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామని, ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.


వేపాడలో నీట మునిగిన వరి కుప్పలు

45 ఎకరాల్లో నీటమునిగిన వరి

నెల్లిమర్ల: తుపాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 45 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మొదటి రోజు వర్షం పెద్దగా లేకపోయినా మంగళవారం రాత్రి భారీగా వర్షం కురవడంతో స్థానిక బిసి గురుకుల బాలికల కళాశాల ప్రహరీ గోడ కూలి పోయింది. సతివాడలో వరి, పత్తి పంట, అలుగోలు సీతారాముని పేట, తంగుడుబిల్లి, జరజాపుపేట, నెల్లిమర్ల, కొండ వెలగాడ, కొండ గుంపాం, మొయిద, చంద్రంపేట, వల్లూరు, గుషిణి తదితర గ్రామాల్లో 45 ఎకరాల్లో వరిపంట నీట మునిగి నట్లు అధికార్ల అంచనా వేశారు. కాగా మంగళ వారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 74.6మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదయ్యింది.

700 ఎకరాల్లో వరి పంటకు నష్టం

చీపురుపల్లి: మండలంలో ఈ ఏడాది 6,665 ఎకరాలలో రైతులు వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే 4875 ఎకరాలలో వరి కోతలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ తుపాను కారణంగా సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట నష్టపోయినట్లు అధికారులు అంచనా వేసినట్లు సమాచారం.

వరి పంట రక్షణకు చర్యలు తీసుకోవాలి: ఎఒ

నీట మునిగిన వరి పంట రక్షణకు రైతులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. బుధవారం ఆమె చంద్రంపేట, ఎల్ఎన్‌పురం, కొండవెలగాడ, కొండగుంపాం గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విఎఎ జె. వేణుబాబు, రైతులు పాల్గొన్నారు.

మెంటాడ: మంగళవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టం వాటిల్లిన వరి పంటను తహశీల్దార్ టి రామకృష్ణ, ఎఒ గోకుల కృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ వర్షాలు కారణంగా ఆపరాల పంటలైన మినుము, పెసర, ఉలవ, చోడి పంటలు కూడా నీటి మునిగిపోయాయని రైతులు వాపోతున్నారు. 9400 ఎకరాల్లో వరి సాగు కాగా దాదాపు 900లకు పైగా ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

వంగర: మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి ప్రధానంగా వరి పంటకు నష్టం జరిగిందని రైతులు ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న ప్రారంభంలోనే పొలాలలో నీరు చేరడంతో పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాగావళిలో పెరిగిన నీటి ప్రవాహం

తుపాను ప్రభావంతో ఎగువున కురుస్తున్న వర్షాలు కారణంగా పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో గల తోటపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో అక్కడ ప్రాజెక్టు అధికారులు గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టారు. దీంతో మండలాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న నాగావళి నదిలో బుధవారం నీటి ప్రవాహం పెరిగింది. గత కొద్ది రోజులుగా నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో మండలంలోని శివ్వాం, తలగాం, ఓని అగ్రహారం, చిన రాజుల గుమ్మడ రేవులు వద్ద ప్రజలు రాకపోకలు చేసేవారు. ప్రస్తుతం నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.


దెంకాడ: తడిచిన ధాన్యాన్ని చూపిస్తున్న శ్రీనివాసరావు

బొబ్బిలి: తుపాను ప్రభావంతో గాలులు వీయడంతో పాటు వర్షం కురవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. కొన్ని గ్రామాల్లో కోసేసిన వరి పంట తడిసిపోగా మరికొన్ని గ్రామాల్లో పంట పొలాల్లో ఉన్న వరి పంట నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నీటిపాలు కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. మండలంలోని జగన్నాథపురం, కోమటిపల్లి, కొత్తపెంట, గోపాలరాయుడుపేట, పారాది, తదితర గ్రామాల్లో 63 ఎకరాలు వరి నేల మట్టిమైందని వ్యవసాయ శాఖాధికారులు గుర్తించారు. ఎం.బూర్జవలస, పెంట, గున్న తోటవలస, మెట్టవలస, ఎం.పనుకువలస, అలజంగి, కారాడ, రంగరాయపురం, తదితర గ్రామాల్లో కోసేసి పొలాల్లోనే కుప్పలు వేసిన వరి తడిసిపోయిందని రైతులు చెపుతున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. జగన్నాథ పురం, కోమటి పల్లిలో నేలకోరిగిన వరి పంటను ఆయన బుధవారం పరిశీలి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దళారీలు, వ్యాపారులను నివారించాలని కోరారు.

రామభద్రపురం: వర్షాల వల్ల వరి పంటకు అపార నష్టం వాటిల్లిందని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. బుధవారం ఎఒ వెంకటయ్యతో కలిసి వివిధ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. సుమారు 78 ఎకరాల వరకు వరి పంట నేలకు ఒరిగి నీట మునిగిందనీ, సుమారు 12 ఎకరాల్లో కోసిన వరి పంట పూర్తిగా వర్షపు నీటిలో మునిగి ఉనట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. చాలా చోట్ల పత్తి పంట చేల్లో కూడా నీరు నిల్వ ఉన్నట్లు గుర్తుంచి ఆ నిల్వ నీటిని కాలువల ద్వారా మళ్లించి పత్తి చేను రక్షణ చేసుకోవాలని సూచించారు. తడిచిన ప్రతీ ధాన్యం గింజా కొనుగోలు చేసేలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

దెంకాడ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. మండలంలో సుమారు 50 ఎకరాల్లో వరి దిబ్బలు పొలంలో నీటిలో మునిగిపోగా 25 ఎకరాల్లో వరి నేలకొరిగింది. 20 ఎకరాల్లో కోసిన వరి నీటిలో మునిగిపోయింది. 5 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగినట్లు అంచనా వేస్తున్నారు. మంగళవారం రాత్రి 32 సెంటీమీటర్ల వర్షపాతం నమోద యిందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

లక్కవరపుకోట: మండలంలో బుధవారం 17.4ఎంఎం వర్షపాతం నమోదయింది. నిడిగట్టు, గనివాడ పంచాయతీలలో తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి నీటి మునిగిన వరి పంటలను పరిశీలించారు. లక్కవరపుకోట, గొల్జాం, కల్లేపల్లి, కాసాపేట, కొట్యాడ, చందులూరు, లచ్చింపేట, రేగ తదితర పంచాయతీలలో కోసిన వరిచేను పూర్తిగా నీటిలో మునిగాయి. సుమారు వెయ్యి ఎకరాలు మేర పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాకు సిఎం సహాయ నిధి కింద కేటాయించిన రూ. 2 కోట్లలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించవలసిందిగా కొట్యాడ పంచాయితీ సర్పంచ్ కొట్యాడ దేవిమహేష్ కోరారు.


రామభద్రపురం: నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న తహశీల్దార్

మండలంలో మొత్తం 1704 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారిని స్వాతి అధికారికంగా వెల్లడించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేను 60 ఎకరాలు కాగా, కోసి కుప్పలు పెట్టింది 1614 ఎకరాలు, కోసిన పంటను కుప్పలు పెట్టకుండా వదిలేసినది మరో 30 ఎకరాలు తడిచినట్లు వివరించారు.


భోగాపురం: మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు

భోగాపురం: తుపాను కారణంగా మండలంలోని బైరెడ్డిపాలెంలో పశువుల శాల కూలి బైరెడ్డి పెంటయ్యకు చెందిన ఆవు మృతి చెందింది. తహశీల్దార్ బంగార్రాజు, వైద్యాధికారి రామరాజు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. తీర ప్రాంత గ్రామాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పటికీ ఎటువంటి నష్టం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో వర్షం నీరు వెళ్లే మార్గం లేక పాఠశాలలోనే నిల్వ ఉండిపోయింది. ఈ సమస్య ఎప్పటినుంచో ఉన్నప్పటికీ పట్టించుకునే వారు లేరని పలువురు అంటున్నారు.

గజపతినగరం: నీట మునిగిన పంట పొలాలను గంగ చొల్ల పెంట, పిడిసీల, దోలపాలెంలో బుధవారం సహయ వ్యవసాయ సంచాలకులు మహరాజన్, ఎఒ సిహెచ్ ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.ఎంవి శ్రీనివాస్, డాక్టర్ స్వాతి పరిశీలించారు. మండలంలోని ఈ ఏడాది 9,392 ఎకరాల్లో వరి పంటలు వేయగా 780 ఎకరాల్లో నీట మునిగిందని తెలిపారు.

300 ఎకరాల్లో తడిచిన పంట

పూసపాటిరేగ: మండలంలోని ఈ ఏడాది 4,900 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంటంతా కోతకు వచ్చింది. దీంతో నాలుగు రోజులు క్రితం సుమారుగా 3,500 ఎకరాలు వరి పంట కోతలయ్యాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సుమారుగా 3 వేల ఎకరాలు వరకూ కోతకోసిన పంటను పొలాల్లో గాలిదిబ్బలు పెట్టారు. మరో 300 వందల ఎకరాలు వరకూ పొలంలో పనలు ఉండిపోయాయి. ఈదురు గాలులతో వర్షం రావడంతో 300వందల ఎకరాలు కోతకోసిన పనలు పొలంలోనే ఉండి మునిగిపోయాయి. మరో 15 వందల ఎకరాలు పంట కోతకు సిద్దంగా ఉంది. మొత్తం పంటంతా తుఫాన్ దాటికి అతలాకుతలం అయ్యింది. కుమిలి, రెల్లివలస, కొప్పెర్లలో పొలాల్లో ఉన్న గాలిదిబ్బలన్నీ సగానికిపైగానే నీటమునిగిపోయాయి.

యువగళం ముగింపు సభాస్థలి పరిశీలన

భోగాపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభకు సంబంధించిన స్థలాన్ని టిడిపి నాయకులు బుధవారం పరిశీలించారు. పోలిపల్లి వద్ద ఉన్న భూమాత లేఔట్‌ను మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కోరాడ రాజబాబు తదితరులు పరిశీలించారు. నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ, నియోజకవర్గం పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ సువ్వాడ రవి శేఖర్, కంది చంద్రశేఖర్, మహంతి చిన్నం నాయుడు, పతివాడ తమ్ము నాయుడు తదితరులతో సభా స్థలం గురించి చర్చించారు. జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో సభ పెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుందని చర్చించుకున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మరో రెండు రోజుల్లో ఖరారు కానున్నట్లు చెబుతున్నారు.

గంజాయి రవాణా ముద్దాయిలకు పదేళ్ల జైలు

శృంగవరపుకోట: 2017,18 సంవత్సరాలకు సంబంధించి మండలంలోని 20 కేజీల గంజాయితో పట్టుబడిన దురయా సాయిబాబా, దురియా కమలను ముద్దాయిలకు జిల్లా జడ్జి జి రజిని బుధవారం ఒక్కొక్కరికి 10 సంవత్సరాల జైశిక్ష, రూ.50 వేలు జరిమానా విధించారని ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి రవికుమార్ వాదించగా కోర్టు కానిస్టేబుల్‌గా పి అప్పలకొండ వ్యవహరించారని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ధర్మారావు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

దీర్ఘకాలంగా నెలకొని ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు, వర్కర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిటియు జిల్లా నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక అంగన్ వాడీ కార్యకర్తలు, వర్కర్స్‌తో కలసి చీపురుపల్లి పట్టణంలో గల అంబేద్కర్ విగ్రహవద్ద బుధవారం నిరశనను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 8 నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ నాయకులు నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం కాబోతున్నామని సతివాడ సెక్టార్ నాయకులు ఈశ్వరమ్మ తెలిపారు. బుదవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంబేద్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకొని సతివాడ ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు.


చీపురుపల్లి: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సుధారాణి డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పాకివీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామన్నారు. పిరిడి,అలజడి, కారాడలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, రోజా, ఉమాగౌరి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుండి చేపడుతున్న నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఈ నెల 8తేదిన అంగన్వాడీలు తలపెట్టనున్న నిరవదికి సమ్మె పోస్టర్‌ను బుధవారం సిఐటియు అధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ ఆధ్వర్యంలో దళిత కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కారం కోరుతు తలపెట్టనున్న సమ్మెలో అందరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సత్యప్రియ, జ్యోతి, తదితరులు పాల్యొన్నారు.

ఇస్త్రీ పెట్టె వితరణ

శృంగవరపుకోట: టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ బుధవారం పట్టణంలోని తన నివాసం వద్ద చాకలి వీధిలో నివాసం ఉంటున్న కొట్యాడ లక్ష్మీకి రూ.6200 విలువ గల ఇస్త్రీ పెట్టె వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, ఎస్ కోట మండల పార్టీ సెక్రెటరీ జుట్టాడ రామసత్యం, టౌన్ పార్టీ ఉపాధ్యక్షుడు మదిబోయిన మంగరాజు పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్యాన్లు..

నెల్లిమర: మండలంలోని గొర్లిపేట పైడితల్లి ఆలయానికి జరజాపుపేటకు చెందిన సాధన యువ జన సంఘం ఆరు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేసింది. బుదవారం పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్టలో భాగంగా వీటిని కమిటీకి అందించారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం ప్రతిని ధులు పోలుభోతు దుర్గాప్రసాద్, తుమ్ము అశోక్, రాజమండ్రి రాంబాబు, బొడ్డు బలరాం, రోంగలి దుర్గాప్రసాద్, పసుమర్తి వెంకటరమణ వెంకటరావు, అశోక్, వెంకటరమణ, మణికంఠ పాల్గొన్నారు.

దార్శనికుడు అంబేద్కర్

ప్రజాశక్తి - రామభద్రపురం

భారతరత్న, రాజ్యాంగ రచనా శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గొప్ప దార్శినికులని ప్రతీ విద్యార్థి అతనిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత విద్యావంతులు కావాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు విద్యార్థులకు సూచించారు. నాయుడు వలస పాఠశాలలో బుధవారం అంబెద్కర్ 67వ వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **జామి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, సీనియర్ దళిత నాయకుడు సూర్యనారాయణ, ఎంపిటిసి సూరిదేముడు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జీవన్, ఉపాధ్యాయులు ఇప్పాక నాగరాజు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. **వేపాడ:** మండల కేంద్రంలోని వల్లంపూడి, వేపాడ గ్రామాలతో పాటు, సింగరాయి, గుడివాడ, జాకేరు, వావిలిపాడు, నల్లబెల్లి తదితర గ్రామాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులతో పాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** సారిపల్లిలో అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు బుదవారం దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా డిబిఎస్‌యు జిల్లా కార్యదర్శి రాయి ఈశ్వరరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **వంగర:** మండలంలోని పటువర్ధనం, అరసాడ శివ్వాం, వంగర, వివిఆర్ పేట గ్రామాలలో అంబేద్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యజ్ఞల అప్పలరాము, భీమరాజు, దుర్గారావు, గౌరీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **బొబ్బిలి:** అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీహరి, జెసి రాజు, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సిపిఐ, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రొట్టెలు, పండ్లను ఆసుపత్రి నవారింటెండెంట్ జి.శశిభూషణరావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సంఘవీధిలో బుధవారం అంబేద్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సోరు సాంబయ్య, జిల్లా నాయకులు బి.అప్పారావు, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, న్యాయవాది విల్సన్ బాబా పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోను కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆర్‌టిసి డిపోలో అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. డిపో మేనేజర్ రమేష్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, స్థానిక పాఠశాలలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గడి బంగారునాయుడు, పట్టణంలోని ప్రకాశం మార్కెట్ వద్ద సర్పంచ్ సంతోష్ కుమారి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **బొండపల్లి:** బుధవారం స్థానిక దళిత నాయకుడు బగ్గ ఎర్రయ్య, ఎంపిపి చల్ల చలంనాయుడు, ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, తహశీల్దార్ ప్రసాదరావు మండల సముదాయం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమ లో ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, విఆర్ఒ డి.రవి, సీనియర్ సహాయకులు శ్రీనువాస రావు తదితరులు పాల్గొన్నారు. **విజయనగరం కోట :** అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజలందరూ ముందుకెళ్లాలని టిడిపి బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అశోక్ బంగ్లాలో అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి రాజు, నాయకులు పాల్గొన్నారు. **విజయనగరం టౌన్ :** జెఎన్‌టియులో విసి కె.వెంకటసుబ్బయ్య.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ జి.జయసుమ, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీకుమార్ పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి జనసేన నేత గురాన అయ్యలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జనసైనికులు ఏంటి రాజేష్, ఎం.పవన్‌కుమార్, పృథ్వీ భార్గవ్, గవర శంకర్రావు పాల్గొన్నారు. డిబిఎస్‌యు కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు ఆధ్వర్యాన అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయి ఈశ్వరరావు, వరలక్ష్మి, బి.పార్థసారథి పాల్గొన్నారు. **విజయనగరంలీగల్ :** జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్‌రావు ఆధ్వర్యాన జిల్లా జడ్జి సాయికళ్యాణ చక్రవర్తి.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయమూర్తులు రజనీ, సికిందర్ బాషా, మీనాదేవి, కె.నాగమణి, లక్ష్మీకుమారి, న్యాయమూర్తి కోలగట్ల తమ్మన్నశెట్టి పాల్గొన్నారు. **విజయనగరం టౌన్ :** కోట జంక్షన్ వద్ద ఉన్న విజయ బ్లడ్ బ్యాంక్ వద్ద బుధవారం విజయనగరం యూత్ ఫౌండేషన్ , అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లాలో రక్తం నిల్వల కొరత కారణంగా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు విజయనగరం యూత్ అధ్యక్షులు షేక్ ఇల్తామాష్ తెలిపారు. శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, విజయ్, కళ్యాణ్, అమ్మ సేవా సమితి అధ్యక్షులు నాని, కృష్ణ పాల్గొన్నారు.



రామభద్రపురం: నివాళులర్పిస్తున్న జెసి రాజు, విద్యార్థులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- గజపతినగరం

మండలం లోని సీతారాంపురం, పిడిశీల తదితర గ్రామాలలో నీటమునిగిన వరి పంటలను బుదవారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కరణం.శివరామకృష్ణ పరిశీలిం చారు. ఈయన వెంట లెంక సత్యనా రాయణ, మజ్జి గోవిందరావు, ఆవుగడ్డి సన్యాసి నాయుడు, కర్రీ సత్యనాయణ, పిన్నింటి లక్ష్మి నాయుడు, పూర్ణ చంద్ర రావు తదితరులున్నారు.

బొండపల్లి : బొండపల్లి గ్రామంలో మునిగిన వరి పంటలను మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జి కెఎ నాయుడు పరిశీలించారు. ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు బండారు బాలాజీ, వేమలి చైతన్య బాబు, బొడ్డు ఉమ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందజేయాలని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి బంగార్రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో నష్టపోయిన రైతులను కలిసి బుధవారం పరామర్శించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన నష్టపరిహారం వచ్చే టిడిపి పార్టీ తరుపున పోరాటం చేస్తామని రైతులకు ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోరాడ తాతారావు, సరగడ తోగులురెడ్డి, గ్రామ సర్పంచ్ బుగత రామ్మోహన్ పాల్గొన్నారు.


ఎస్‌కోట: నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట: మండలంలో దెబ్బతిన్న వరి పంటను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ బుధవారం సాయంత్రం పరిశీలించారు. రేవల్ల పాలెంలో నీట మునిగిన పంటను పరిశీలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, రామసత్యం, రైతులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి, వీరభద్ర పురం గ్రామాలలో నీట మునిగిన వరి పంటను టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలితకుమారి బుధవారం పరిశీలించారు. రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందిచాలని డిమాండ్ చేశారు. నీట మునిగిన వరి పంటలను తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ విజయ, ఎఒ మాధురి శరణ్య పరిశీలించారు. 441 రైతులకు సంభందించి 326 ఎకరాల్లో ప్రాథమికంగా నష్ట తీవ్రతను గుర్తించామని తెలిపారు.